క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

దౌల్తాబాద్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 7వ తేదీ సోమవారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తిరుమలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. కావున మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

శ్రీవారి నిజరూప దర్శనం


శ్రీవారి మూలమూర్తి

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం స్వామి వారు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిత్య పూజలు, కైంకర్యాలు జరిగాయి. విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనే, నెయ్యి, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో స్వామివారి మూలమూర్తికి అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దౌల్తాబాద్ తహసీల్దార్‌గా విజయ్‌కుమార్



దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండల తహసీల్దార్‌గా విజయ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ కృష్ణయ్య రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. సంగారెడ్డి జిల్లాలో పని చేస్తున్న విజయ్‌కుమార్ దౌల్తాబాద్‌కు బదిలీపై వచ్చారు. మండలంలోని రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు


గురునాథ్‌రెడ్డిని కలిసిన నాయకులు

కొడంగల్: మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని దుద్యాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గురునాథ్‌రెడ్డిని కలిసి శాలువతో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీలోకి రావడంతో పార్టీ మరింత బలోపేతమవుతోందని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు.

బీఆర్‌ఎస్ పథకాలు ఆదర్శం

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

నవాబుపేట: తెలంగాణలో బీఆర్‌ఎస్ చేపడుతున్న పథకాలు దేశానికే ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. నవాబ్‌పేట మండలం గంగ్యాడ, నారెగూడ, పూలపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా చూస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గోపాల్, సయ్యద్‌గౌస్, సాయికుమార్, రాములు, శేఖర్‌రెడ్డి, హరికిషన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పద్మరాష్, గాలయ్య, మల్లేషం, శేకర్, పెంటయ్య పాల్గొన్నారు.

నిధులు కేటాయించి.. అభివృద్ధి చేయండి

అనంతగిరి: అసెంబ్లీ సమావేశాల్లో శనివారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ అనంతగిరి అభివృద్ధిపై మాట్లాడారు. అనంతగిరిలో పురాతన కాలం నుంచి ప్రసిద్ధి చెందిన శ్రీ అనంత పద్మనాభస్వామి దేవాలయం, సమీపంలోని బండబావి హనుమాన్ దేవాలయం, బుగ్గ రామేశ్వర దేవాలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కోరారు. అలాగే, వికారాబాద్‌లోని టీబీ శానిటోరియంలో ఆయా హోదాల్లో పనిచేస్తున్న 170 మంది సిబ్బంది డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలోకి వర్తిస్తారని వారిని డీఎంఈ పర్యవేక్షణలో మిగతా ప్రదేశాలకు పంపించకుండా వికారాబాద్‌లోనే వారి సేవలు కొనసాగేలా అవకాశం కల్పించాలని కోరారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

దోమ: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి దోమ మండలంలోని దాదాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కార్యకర్తలు సమష్టి సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, తాలూక అధ్యక్షుడు జగన్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

కూలీల కొరత.. రైతుల కలత

- పెరుగుతున్న సాగు.. తగ్గుతున్న కూలీలు
- రెట్టింపైన కూలీ రేట్లు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


పంటను మించిన కలుపు మొక్కలు

పరిగి: వ్యవసాయానికి కూలీల కొరత వేధిస్తోంది. వరినాట్లు వేసే సమయం కావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. దీంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాగు చేసిన వర్షాధార పంటలకు కలుపు తీసేందుకు కూలీల దొరకక కలుపు పంటను మించిపోతుంది. జిల్లా వ్యాప్తంగా ఒకేసారి వర్షాలు కురవకపోవడంతో అటు వరినాట్లు వేసే రైతులు, కలుపుతీత రైతులు ఒకేసారి పనులు చేయిస్తుండడంతో కూలీల కొరత తీవ్రంగా ఏర్పడింది. దీంతో కూలీల రేట్లు రెట్టింపు అయ్యాయి.

రూ. 700 ఇచ్చినా దొరకని కూలీలు

వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులందరూ ఒకేసారి వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. దీంతో కూలీ కొరత ఏర్పడి అమాంతం కూలీల రేట్లు పెరిగాయి. గతంలో రూ. 200నుంచి రూ.300వరకు ఇచ్చేవారు. ప్రస్తుతం రూ. 700 నుంచి రూ.800లు ఇచ్చిన వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. కొన్ని ప్రాంతాల్లోని రైతులు ఎక్కువ కూలీ ఇచ్చి వాహనాలను ఏర్పాటు చేయించి దూర ప్రాంతాల నుంచి కూలీలను తెచ్చి పనులు కానిస్తున్నారు. అయితే, పేద మధ్య తరగతి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

దెబ్బతింటున్న పంటలు

పెరిగిన కూలీల రేట్లతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అదునుకు కలుపు తీయకపోవడంతో కలుపు పంటను మించిపోతుంది. రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. కొంత మంది రైతులు కూలీలు దొరక్క సాగు చేసిన పంటలో కలుపు తీయకుండా కలుపు మందులు పిచికారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికే వరినాట్లు వేసి కలుపులు తీయాల్సి ఉండగా ఇంకా వరినాట్లే పూర్తి కాలేదు. నారుమళ్లు ముదిరిపోవడంతో పంట దిగుబడిపై దెబ్బపడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

“రెండింతలు పెరిగిన కూలీల రేట్లు



కూలీల రేట్లు రెండింతలు కావడంతో పెట్టుబడి కూడా భారీగా పెరిగిపోతుంది. అయినా కూలీలు దొరకని పరిస్థితి. గతంలో గ్రామాల్లో కూలీల కొరత ఉండేది కాదు. మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయ పనుల చేసే వారి సంఖ్య భారీగా తగ్గుతుంది. దీంతో కూలీల రేట్లు కూడా భారీగా పెరుగుతున్నాయి.

– రవికుమార్,యువ రైతు, మోత్కూర్

సాగు కష్టంగా మారింది



వ్యవసాయం చేయడానికి కూలీలు తప్పనిసరి. విత్తనాలు విత్తిన నాటి నుంచి కోత నూర్పిడి తదితర పనులకు కూలీల అవసరం ఉంటుంది. రైతులంతా ఒకేసారి ఒకే పంట సాగు చేయడంతో కూలీల కొరత ఏర్పడుతుంది. అడినంత కూలీ ఇస్తాం అన్ని దొరకడం కష్టంగా మారింది.

– నరహరి రైతు, రంగంపల్లి

స్నేహంతో కూడిన ‘బాధ్యత’

పేద విద్యార్థులకు అండ

- 15 ఏళ్లుగా కొనసాగుతున్న సేవ
- నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం


ప్లేట్లు ఇస్తున్న బాల్యమిత్రులు

కొడంగల్ : పట్టణానికి చెందిన 15మంది బాల్య మిత్రులు ‘బాధ్యత’ అనే సేవా సంస్థను స్థాపించి పది మందికి అండగా నిలుస్తున్నారు. స్నేహంలో కూడా బాధ్యతను వీడని వారిని చూపి కొడంగల్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ప్రపంచ స్నేహితుల దినోత్సవం కథనం.. పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1990 బ్యాచ్ విద్యార్థులు బాధ్యత అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. వారు సంపాదించిన డబ్బులో కొంత మేరకు వెచ్చించి సమాజానికి ఉపయోగడాలనే ఉన్నతమైన ఆశయంతో వారంతా ఒకటయ్యారు. 15 ఏళ్ల క్రితం ‘బాధ్యత’ స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ చేయించారు. స్నేహితులు ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం సొంతంగా డబ్బులు పెట్టి పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఉచితంగా నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిల్స్, కంపాక్స్‌లు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్‌ల మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి సంవత్సరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు , బలపాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

ప్రతి అడుగు ‘బాధ్యత’గా..

బాధ్యత స్వచ్ఛంద సంస్థను ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు సమాజ సేవలో ప్రతి అడుగు బాధ్యతగా ముందుకు వేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచారు. స్నేహితులంతా కలిసి ప్రతి నెలా వారు సంపాదించిన సొమ్ములో కొంత మొత్తం జమ చేస్తున్నారు. ప్రతి సంవత్సరం జూన్, జులై మాసంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు, పెన్సిళ్లు ఇస్తున్నారు. అంతేకాకుండా గతంలో పాలమూరు జిల్లాను వరదలు ముంచెత్తిన క్రమంలో పట్టణవాసుల సహకారంతో సుమారు రూ.2.5లక్షల విలువ గల నిత్యావసర సరుకులు, మందులు, బట్టలు తదితర వాటిని మాగనూరు మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతంలో పంపిణీ చేశారు. విపత్కర పరిస్థితుల్లో బాధితులకు మేమున్నామని చేయూతనందించారు. నియోజకవర్గ విద్యావంతులు వారి సేవలను గుర్తించి అభినందిస్తున్నారు.

ఓటింగ్ సిస్టంపై అవగాహన


ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఓటింగ్ సిస్టంపై అవగాహన పెంపొందించుకోవాలని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ లింగయ్య, మరికల్ సర్పంచ్ పాండురంగయ్య అన్నారు. శనివారం చౌడాపూర్ మండలంలోని మరికల్‌లో ఈవీఎం మిషన్‌తో ఓట్లు వేసే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈవీఎం మిషన్, వీవీప్యాడ్‌లపై ఓటింగ్ చేసే విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రజలు ఓటు వేస్తున్న సందర్భంలో చేస్తున్న తప్పిదాలను నివారించేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యకుమార్, ఆపరేటర్ ప్రేమకుమార్, నాయకులు యాదయ్య, నర్సింలు, కృష్ణ, గోపాల్, జానీ, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పని చేయాలి


నూతన తహసీల్దార్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: రాజకీయాలకు అతీతంగా పని చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మండల పార్టీ అధ్యక్షుడు అంజనేయులు అన్నారు. శనివారం నూతన తహసీల్దార్ మురళిధర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం మండలంలో ధరణి కారణంగా భూ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ మురళిధర్ మాట్లాడుతూ.. రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారంలో అందరితో కలిసిముందుకు సాగుతామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కుమార్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, నాయకులు నర్సింలు, జలీల్, బాలకృష్ణయ్య, భరత్‌కుమార్ రెడ్డి, ఎల్లయ్య, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

బంట్వారం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌ను బంట్వారం కాంగ్రెస్ నాయకుడు సిద్ధిరాములు స్వామి శనివారం మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. రెవెన్యూ సమస్యల పరిష్కరానికి శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

సర్కార్ బడులకు ప్రోత్సాహం


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న సభ్యులు

ధారూరు: మండలంలోని వివిధ పాఠశాలల్లో సులభంగా విద్యను బోధించుటకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్నట్లు సాధన సంస్థ సీఈఓ చిక్కు మురళిమోహన్ అన్నారు. శనివారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని స్టేషన్‌ధారూరు, గడ్డమీదిగంగారం, మున్నూరు సోమారం, చింతకుంట, గురుదోట్ల, ధారూరు, దోర్నాల్ గ్రామాల పాఠశాలలకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణకు ప్రాథమిక విద్య పటిష్టత కోసం తమ సంస్థ సంవత్సర కాలంగా కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో బాలల సంఘాలను ఏర్పాటు చేసి వారికి బాలల హక్కులపై పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే అంగన్‌వాడీ టీచర్లకు మండల స్థాయి సమావేశాలు నిర్వహించడం, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ మెంబర్స్‌కు అవగాహన సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్ దుకాణం సీజ్



సీజ్ చేసిన ఫెర్టిలైజర్ షాపు

సాక్షి ఎఫెక్ట్..

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని అనురాధ ఫెర్టిలైజర్ దుకాణాన్ని శనివారం వ్యవసాయశాఖ అధికారులు సీజ్ చేశారు. నకిలీ విత్తనాలు అనే కథనం ఈ నెల 3న సాక్షిలో ప్రచురితమయ్యింది. షాపు యజమాని వెంకటరమణ షాపులో నకిలీ విత్తనాలు అమ్ముతున్నారని వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందడంతో కేసు నమోదు చేశారు. అనంతరం స్థానిక జెడ్పీటీసీ మహిపాల్ జిల్లా పరిషత్ సమావేశంలో ఈ విషయం లేవనెత్తడంతో కలెక్టర్ వ్యవసాయశాఖ అధికారుల నుంచి నివేదిక కోరారు. దీంతో షాపు యజమానికి నోటీసులు అందజేశారు. సంజాయిషీ లేకపోవడంతో షాపును సీజ్ చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం

- ఐసీడీఎస్–సీడీపీఓ కాంతారావు
- పలుచోట్ల ర్యాలీలు, అవగాహన


తల్లులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజేశ్వరి

బంట్వారం: తల్లిపాలు బిడ్డకు ఎంతగానో ఆరోగ్యకరమని ఐసీడీఎస్–సీడీపీఓ కాంతారావు అన్నారు. శనివారం కోట్‌పల్లి మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలన్నారు. ఆరు నెలల తర్వాత అదనపు ఆహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలను తాగించాలని సూచించారు. తల్లిపాలల్లో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని తెలిపారు. జ్ఞాపకశక్తితో పాటు శరీర ఎదుగుదల ఉంటుందని చెప్పారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన ,అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ ధనలక్ష్మి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ గీతిక, కోట్‌పల్లి సర్పంచ్ విజయలక్ష్మి, గర్భిణీలు ,బాలింతలు ,తల్లులు ,కిశోర బాలికలు ,అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

తాండూరు టౌన్ : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని పల్లె దవాఖాన డాక్టర్ రాజేశ్వరి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని 33వ వార్డులోని అంగన్‌వాడీ 1, 2 కేంద్రాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు పట్టించాలన్నారు. ముర్రుపాలలో అనేక ఔషధ గుణాలుంటాయన్నారు. శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుటకు ముర్రుపాలు తోడ్పడుతాయన్నారు. బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లుల్లో బ్రెస్ట్ క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వంటివి వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ సుజాత, బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

తల్లిపాలతో మేలు

బొంరాస్‌పేట: తల్లిపాల ఆవశ్యకతను తెలియజేసేందుకు తల్లిపాల వారోత్సవాలు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రతి గ్రామంలోని గర్భిణీలకు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశకార్యకర్తలు అవగాహన కల్పించాలని ఎంపీపీ హేమీ బాయి సూచించారు. అనంతరం 20మందిపైగా గర్భిణీలకు సీమంతాలు చేశారు. నాయకులు వైస్‌ఎంపీపీ శ్రావణ్, ఐసీడీఎస్ సీడీపీఓ జయరామ్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ కాంతారావు

కొడంగల్ రూరల్ : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని విద్యాభిమాని రెడ్డప్ప దొర అన్నారు. శనివారం మండలంలోని రావులపల్లిలో రైతువేదికలో అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు సంయుక్తంగా తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డప్ప దొర, అంగన్‌వాడీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దశమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సుధీనారాణి, శైజాధి, పద్మ, విద్యులత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద పటేల్


నోట్‌బుక్కులు అందజేసిన శుభప్రద్, శ్రీవాణి

తాండూరు టౌన్ : విద్యార్థులకు అన్ని విధాలుగా చేయూతనందిస్తామని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. శనివారం శుభప్రద్ పటేల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కువ మంది పేద విద్యార్థులు చదువుతుంటారు. వారి అభివృద్ధికి తమ ట్రస్టు అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాలు రావడం గర్వించదగిన విషయమన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులకు ట్రస్టు ద్వారా మరింత తోడ్పాటునందిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ శ్రీవాణి పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి అవగాహన

అనంతగిరి: యువిన్ వ్యాక్సినేషన్ పోర్టల్‌పై జిల్లాలోని మహిళా ఆరోగ్య కార్యకర్తలకు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు, సూపర్‌వైజర్లకు శనివారం వికారాబాద్ పట్టణంలోని మహావీర్ ఆస్పత్రిలో ఒకరోజు శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యువిన్ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ జోత్స్న శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. యువిన్ అనేది పిల్లలకు టీకాలు అందించడానికి రూపొందించిన సాంకేతిక కార్యక్రమం అన్నారు. పుట్టిన ప్రతి పిల్లవాడి సమాచారం, గర్భిణీ సమాచారం నమోదు చేసి వారికి ఎప్పటికప్పుడు టీకాలు ఇవ్వాలని తెలుసుకోవడానికి ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానంతో చేసిన కార్యక్రమం అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ జీవరాజు, నోడల్ అధికారి డాక్టర్ బుచ్చిబాబు స్టాటస్టికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు

అనంతగిరి: అసెంబ్లీ ముట్టడి సందర్భంగా అక్రమ అరెస్టులకు నిరసనగా శనివారం మెడికల్ ల్యాండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మెడికల్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సమాన పనికి సమాన వేతనాలు, ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సంఘం నాయకులు శ్వేతా రాణి, షబానా, రజియా, సుకన్య, పాపమ్మ, సంతోష, వరలక్ష్మి, చంద్రకళ, పుష్ప, లక్ష్మి, స్వప్న, మల్లమ్మ, మాధవి, వెంకటమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు షీ టీం భరోసా


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు: బాలిక, మహిళలకు షీ టీం భరోసా కల్పిస్తూ నిరంతరంగా పని చేస్తోందని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో షీ టీం నిఘాపై విద్యార్థులకు అవగాహన ం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థినులకు, మహిళలకు ఎలాంటి సమస్య వచ్చి న షీ టీం ఫోర్స్ సిద్ధంగా ఉంటుందన్నారు. సమస్యల్లో ఉన్న వారు 181 లేదా 100 టోల్ ఫ్రీ నంబర్‌లకు ఫోన్ చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పోలీసుశాఖ గోప్యంగా ఉంచుతుందన్నా రు. ఆడపిల్లల చదువుకు ఆటంకం కలిగించకుండా చూసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, షీ టీం ప్రతినిధులు శేఖర్, మమత తదితరులున్నారు.